క్లుప్తంగా

ప్రభుత్వ భవన నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ భవన నిర్మాణాలపై పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎం.కృష్ణారెడ్డి ఆదివారం అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో నిర్మాణ దశలోని సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాల స్థితిగతులు, నిర్మాణాల పూర్తికి చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. నిర్మాణాలు ప్రారంభం చేయని చోట వాటిని రద్దు చేసి, కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు.

ఫ్యాన్‌ల వితరణ



ఫ్యాన్‌లు అందజేస్తున్న సంకిలి విలేజ్ డెవలప్‌మెంట్ సభ్యులు

రేగిడి: మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంకిలి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఆదివారం ఫ్యాన్‌లు వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు చేతులమీదుగా మూడు ఫ్యాన్‌లను ప్రధానోపాధ్యాయుడు రామినాయుడుకు అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యంలో భాగంగా వీటిని అందించామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సకు 40 మంది ఎంపిక



నేత్ర వైద్య తనిఖీల అనంతరం ప్రిస్క్రిప్షన్ రాస్తున్న ఆప్తాలమిక్ అధికారి సురేష్

రాజాం: పట్టణ పరిధిలోని కంచర వీధిలో ఉన్న సత్యసాయి మందిరం ఆవరణలో ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 100 మందికి నేత్ర వైద్య తనిఖీలు చేయగా, 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అనంతరం పట్టణానికి చెందిన జీఎంఆర్ సాయంతో రోగులకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, క్యాంపు కో–ఆర్డినేటర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి బాగా చదువుకోవాలని, పుస్తక పఠనంపై దృష్టి సారించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ మేరకు ప్రతీ ఆదివారం చిన్నారులకు గ్రంథాలయంలో పుస్తక పఠనం ఏ విధంగా చేయాలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలుగుతుందన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



ఉపాధ్యాయులకు మెమెంటోలు అందజేస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల బంధాన్ని వక్తలు కొనియాడారు. తల్లిదండ్రుల తర్వాత గురువే తల్లి, తండ్రి, దైవం అని, గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. హెచ్‌ఎం పి.నాగయ్య మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షల భయం వీడాలని, ధైర్యంగా పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కార్యదర్శి అచ్యుత్‌కుమార్, పీడీలు బి.శ్రీనివాసరావు, శంకరరావు, బి.హరి తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం

వాడవాడలా పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులంతా కలిసి ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అంగవైకల్యాన్ని రూపుమాపుదాం.. పోలియో రహిత సమాజం నిర్మిద్దామని నినాదాలు చేశారు. అనంతరం చుక్కల మందు ఆవశ్యకతను వివరించారు. పోలియో భయంకరమైన వ్యాధి అని, ఇది సోకిన వారిలో పక్షవాతం కూడా వస్తుందని, చిన్నారులే ఎక్కువగా దీనిబారిన పడే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా ఏటా విధిగా పోలియో చుక్కలు వేయడం జరుగుతోందన్నారు. –సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: పక్కి గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో ఆగిఉన్న బస్సులోని చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది



రామభద్రపురంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



రాజాం: శ్రీనివాస థియేటర్ రోడ్డులో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



రాజాం సిటీ: పొనుగుటివలసలో పోలియో చుక్కలు వేయిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యకుమార్



బాడంగి: మండల కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ రామారావు



రాజాం సిటీ: పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ రాజు



వంగర: మగ్గూరులో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



సంతకవిటి: చిన్నారి నోట్లో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు



తెర్లాం: మండల కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న సీహెచ్‌వో భాస్కరరావు



రేగిడి: ఏవీపురంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం'లో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పక్కనే ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సైనికుల్లా పనిచేయాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం(రామకృష్ణా థియేటర్)లో మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ శ్రేణులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ఓ బైబిల్‌గా, ఖురాన్‌గా, భగవద్గీతగా భావించిన ఆయన అందులోని 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగనన్న ప్రజలకు చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి, వివరించాలని, ప్రతీ లబ్ధిదారుని ఓటు వైఎస్సార్ సీపీకే పడేలా చూడాలన్నారు. అలాగే గతంలో టీడీపీ జనానికి చేసిన మోసాలు వివరించి, మళ్లీ అదే పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్ అంధకారమవుతుందన్న విషయాన్ని తెలపాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో గెలుపు కోసం తాపత్రయ పడుతూ టీడీపీ–జనసేన పార్టీలు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో, నియోజకవర్గంలో బూత్ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ ఘనవిజయానికి అహర్నిశలు కష్టపడి పనిచేయాలన్నారు. సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించి, ఎమ్మెల్యేగా తనను, సీఎం..గా జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. బూత్ స్థాయిలో ప్రతి ఇంటికీ పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు వీలైనన్నిసార్లు వెళ్లి, వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని తెలియజేయాలన్నారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేసి, ఎన్నికల సమరానికి సిద్ధం కావాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఏవిధంగా పనిచేయాలి, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ వివరించారు. సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ, మండల జేసీఎస్ కన్వీనర్ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న రాజాం పట్టణవాసులు

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఉన్న చిన్నహరిజన వీధిలో ఆదివారం పర్యటించిన ఆయనకు ఆ ప్రాంత ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే ఏ గ్రామంలో చూసినా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ వంటి ప్రభుత్వ భవనాలు నిర్మించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రస్తుతమున్న ప్రజోపయోకర పథకాలేవీ లేవన్నారు. నీరు–చెట్టు పేరిట రాష్ట్ర ఖజానాను అప్పట్లో టీడీపీ దోచుకుందని దుయ్యబట్టారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. టీడీపీకి అధికారమిస్తే ఇప్పుడు సంక్షేమ పథకాలేవీ అమలుకావన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, సచివాలయ కన్వీనర్ సింబాల రాము, కొల్ల రమ్య తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సంబరాల్లో ఎమ్మెల్సీ విక్రాంత్



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

రాజాం: మండలంలోని నందబలగ గ్రామంలో బింగి, కొర్ను కుటుంబాల వారు నిర్వహిస్తున్న రామదేవుని(రాములోరి) సంబరాల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల విశిష్టత తెలుసుకుని, ఊరేగింపులో కూడా పాల్గొన్నారు. ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రింగురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు సమాఖ్య ప్రతినిధులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, తాను సమాజ సేవకుడినని, నిరంతరం ప్రజల సంక్షేమానికే కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం నిర్వాహకులు కోలగట్లను సత్కరించారు. కార్యక్రమంలో పీబీ శ్రీనివాస్, కట్టమూరి చంద్రశేఖర్, ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, గన్నవరపు శ్రీనివాస్, దామరాజు శంకరం, కె.సరోజిని, కేజే శర్మ, వై.ప్రభు మాస్టారు, ఎస్.శ్రీనివాస్, వీఎస్ఎన్ కుమార్, భానురాజా, భమిడిపాటి రామ్‌కుమార్ శర్మ, ఆర్.సత్యనారాయణ శర్మ, గీతాశర్మ, పాణంగిపల్లి భానుమతి, జి.మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'శంబంగిని గెలిపించుకుందాం–బీసీల ఐక్యత చాటుదాం'



బొబ్బిలిలో కొప్పల వెలమ సంఘ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లు

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం.. బీసీల ఐక్యత చాటుదాం అని కోరుతూ కొప్పల వెలమ సంఘ నాయకులు స్థానిక పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన బ్యానర్లు ఆలోచింపజేస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అన్నివర్గాలకు సమప్రాధాన్యమిస్తూ ఏ నియోజకవర్గంలో ఏ సామాజిక వర్గం ఎక్కువగా ఉంటే అక్కడ ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే అత్యధిక బీసీ ఓటర్లున్న బొబ్బిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీలను కాదని, ఓసీలకు చెందిన రాజులను టీడీపీ ప్రకటించడాన్ని ఆ సంఘ(కొప్పల వెలమ) నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనడానికి ఈ బ్యానర్లే నిదర్శనం. ప్రస్తుతం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బేబీ నాయన ఉండగా, బొబ్బిలి నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం బీసీలుండగా, టీడీపీ ఓసీలకు సీటివ్వడమేంటని సంఘ నాయకులు మండిపడుతున్నారు. అందరం కలసికట్టుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడునే మళ్లీ గెలిపించుకుందామంటుండడం విశేషం. ఇవే బ్యానర్లను సోమవారం మండల కేంద్రాలు, గ్రామపంచాయతీల్లో కూడా ఏర్పాటు చేయడంపై ఆ సంఘ నాయకులు చర్చిస్తున్నారు.

అన్నదానం

రాజాం: స్థానిక గాయత్రి కాలనీలోని గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అన్నదానం చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, కొండవేటి వివేకానందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

దత్తిరాజేరు: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆపథకం ఏపీ ఓ వెంకటప్పలనాయుడు ఆదివారం తెలిపారు. ప్రజావేదికలో జిల్లా అధికారులతో పాటు ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, వేతనదారులు హాజరు కావాలని కోరారు.

ప్రగతి బాటలు







చిత్రంలో కనిపిస్తున్నది వంగర మండలంలోని మద్దివలస గ్రామ వీధుల్లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు. గతంలో ఇక్కడ సరైన రోడ్లు, కాలువలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమైన రోడ్డులో నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. ఒక్కోసారి ప్రమాదవశాత్తు జారి పడి పలువురు గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. సర్పంచ్ ఉత్తరావెల్లి గణేష్ బెనర్జీ ఆధ్వర్యంలో రూ.5 లక్షల నిధులతో ఇప్పుడు కొత్తగా రోడ్లు వేయడంతో ఇన్నాళ్లకు తమ కష్టాలు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –వంగర

93 శాతం పింఛన్ల పంపిణీ



రేగిడి: వన్నలిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతు

రేగిడి: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 93 శాతం మేర పూర్తయిందని ఎంపీడీవో శ్యామలాకుమారి ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 11,021 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 10,249 పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన పింఛన్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి అందించడం జరుగుతుందన్నారు.

విశాఖ వెళ్లి, పింఛన్ అందజేత

వంగర: అనారోగ్యం కారణంగా విశాఖపట్నంలో బంధువుల ఇంట్లో ఉంటున్న వంగరకు చెందిన వల్లూరు పార్వతమ్మ వద్దకు వలంటీర్ పద్మ ఆదివారం వెళ్లి, పింఛన్ అందజేశారు. గ్రామం నుంచి నగరానికి వచ్చి మరీ పెన్షన్ అందజేయడాన్ని లబ్ధిదారు, ఆమె కుటుంబీకులు, బంధువులు మెచ్చుకుంటున్నారు.